
# నవతరం కోసం నవతరం రాసిన నవ్య కథ

'నీకు ఫాంటమ్ లింబ్ అంటే తెలుసా?' అడిగాడు డాక్టర్ లియాన్.

డాక్టర్ లియాన్ ఇటలీ నుంచి వచ్చాడు. చాలా సరదాగా ఉంటాడు. ఎప్పుడూ ఏవేవో ఆసక్తికరమైన, చమత్కారమైన కథలు చెప్తూంటాడు. లియాన్ వల్ల ఇరాన్‌లో కూడా నవ్వగలుగుతున్నాను నేను. ఒక వ్యక్తి దురహంకారం, ఒక దేశ ప్రజల దౌర్భాగ్యంగా పరిణమించటం ఇరాన్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. నాగరీకులమనుకుంటున్న వారి అనాగరికతకు తిరుగులేని నిదర్శనం ఇరాక్. ఇరాక్‌లో పరిస్థితిని అంచనా వేయటానికి అంతర్జాతీయ బృందంలో సభ్యుడిగా వెళ్ళాను నేను పనిచేసే పత్రిక తరఫున. అక్కడి పరిస్థితి చూస్తూంటే కడుపు తరుక్కుపోతోంది. గుండె మండిపోతోంది. నిరాశ మనసుని ఆవరించి, జీవితేచ్ఛను నశింపచేస్తోంది.

# ఫాంటమ్ లింబ్

## కస్తూరి మురళీకృష్ణ



అటువంటి పరిస్థితులలో కూడా నవ్వుతూ, తుళ్లుతూ, కథలు చెప్తున్నాడు లియాన్. 'జీవితం ఏడుస్తూ కూచోటానికి కాదోయ్, నవ్వుతూ నవ్వించటానికి' అంటాడు. 'ఇటువంటి పరిస్థితుల్లో కూడా ఎలా నవ్వగలుగుతున్నావ్'ని అడిగితే.

'ఫాంటమ్ లింబ్ ఏమిటి, దయ్యాల అవయవమా?' అడిగాను నవ్వుతూ.

'జర్నలిస్టువయి ఉండి ఫాంటమ్ లింబ్ అంటే తెలియదా?' అన్నాడు లియాన్.

'మీ దేశంలో లాగా మా దేశంలో జర్నలిస్టంటే అన్నీ తెలిసి ఉండాల్సిన పని లేదు. ఇంతకీ ఫాంటమ్ లింబ్ అంటే ఏమిటి? అడిగాను నవ్వుతూ.

'ఇదొక మానసిక స్థితికి సంబంధించిన పదం. తిరిగే కాలూ తిట్టే నోరు ఊరుకోవంటారు చూడు

అలాంటి స్థితి ఇది.' అన్నాడు.

'అంటే?' అడిగాను. నాకు అర్థం కాలేదు.

'శరీరం హఠాత్తుగా ఏదో అంగాన్ని కోల్పోతుంది. ఉదాహరణకి ఓ వ్యక్తి ప్రమాదం వల్ల కాలు తీసేయాల్సి వచ్చిందనుకుందాం. కాలు తీసేస్తాం. కానీ శరీరం నుంచి కాలు తీసినట్టు మెదడు గ్రహించేందుకు కాస్త సమయం పడుతుంది. మన మెదడులో ప్రతి అవయవానికి, అంగానికి, దాని పని తీరును నిర్దేశించేందుకు నిర్దిష్టమైన బాగాలు ఉంటాయి. తీసేసిన కాలుకు సంబంధించిన సమాచారం మెదడును చేరి, మెదడు ఆ నిజాన్ని జీర్ణించుకునేందుకు కాస్త సమయం అవసరం. మెదడీ నిజాన్ని గ్రహించే వరకూ శరీరంలో అంగం భాగమేనన్నట్టు ప్రవర్తిస్తుంది. ఇలా లేకున్నా ఉన్నట్టుగానే భావన కలిగే అంగాలను 'ఫాంటమ్ లింబ్స్ అంటారు' సిగరెట్ పొగ వదుల్తూ చెప్పాడు లియాన్.

'నాకు సరిగ్గా అర్థం కాలేదు' నిర్మొహమాటంగా అన్నాను.


'వెరీ సింపుల్. బ్రెస్ట్ కేన్సర్ వల్ల ఓ మహిళ వక్షోజాలు తొలగించినా, చాలాకాలం వరకూ అవి ఉన్నట్టే భావించుకోవటం, అపెండిక్స్ తొలగించిన తరువాత కూడా అవి ఉన్నట్టే భావించుకోవటం, నొప్పిని అనుభవించటం వంటివన్నీ 'ఫాంటమ్ లింబ్స్'కి ఉదాహరణలు అన్నాడు. 'ఏమో... లేని కాలు నొప్పిపుట్టటం, లేని చెయ్యి రాయటం... నమ్మబుద్ధి కావటం లేదు.'

నవ్వాడు. గడియారం వైపు చూశాడు.

'బోలెడంత టైమ్ ఉంది. నీ రిలీవర్ ఇప్పుడే గ్రీన్ జోన్ నుంచి బయలుదేరాడు. ఇక్కడికి వచ్చేసరికి ఇంకో గంటయినా పడుతుంది' అన్నాను. ఇరాక్‌లో లియాన్ సంవత్సరం పైగా ఉన్నాడు. అతడి టెర్మ్ అయిపోయింది. అతడిని రిలీవ్ చేయటానికి ఫ్రాన్స్ నుంచి 'జీన్‌పేజ్' వస్తున్నాడు. అతడు రాగానే నేనూ, లియాన్ గ్రీన్‌జోన్‌కు వెళ్తాం. అటు నుంచి ఎవరి దేశానికి వాళ్లం వెళ్లిపోతాం. ఇరాక్‌లో 'గ్రీన్‌జోన్' అన్నది అతని సురక్షితమైన స్థలం. అక్కడ తప్ప మిగతా ఏ ప్రాంతంలో, ఏక్షణంలోనయినా తీవ్రవాదుల దాడులు జరగవచ్చు. గ్రీన్‌జోన్ భద్రతాపరంగా కట్టుదిట్టమైన స్థలం.

మరోసారి గడియారం చూసి గొంతు సవరించుకున్నాడు లియాన్. లియాన్ ఏదో చెప్పబోతున్నాడని గ్రహించి, ఇతర డాక్టర్లు కూడా మా టేబిల్ దగ్గరకు వచ్చారు. 'ఫాంటమ్ లింబ్ గురించి నేను థియరీ చదివాను. కానీ అటువంటి కేసును నేను 'లిక్రిత్'లో పని చేసినప్పుడు చూశాను' మరో సిగరెట్ వెలిగిస్తూ ఆరంభించాడు లియాన్.

'ఆరోజు ఎప్పటిలాగే తీవ్రవాదుల దాడిలో



గాయపడిన వారికి చికిత్స చేస్తున్నాను. ఇంతలో ఓ యువకుడు నా దగ్గరకు వచ్చాడు. చూస్తే ఆరోగ్యం గానే ఉన్నాడు.

'సమస్య ఏమిటి'ని అడిగాను.

'నా చెయ్యి' అన్నాడు.

అప్పుడు గమనించాను. అతడికి ఓ చెయ్యి లేదు. 'ఉన్న చెయ్యా? లేని చెయ్యా?' జోకేశాను. అతడు నవ్వలేదు. సీరియస్‌గా ఉన్నాడు. 'నెల క్రితం జరిగిన తీవ్రవాదుల దాడిలో నా చెయ్యి పోయింది. మొదలు నుంచి చెయ్యి తీసేశారు. కానీ ఆ చెయ్యి ఇప్పుడు దురద పెడుతోంది. భరించలేనంత దురద. ఏవేవో పాకుతున్నట్టుంది. ఎలా గోకను? పాకే వాటిని ఎలా విదిలించను?' అడిగాడు.

'ముందు నాకు నమ్మకం కుదరలేదు. తరువాత ఫాంటమ్ లింబ్ గుర్తుకు వచ్చింది. అతడికి ఈ విషయం వివరించి పంపించేశాను. కొన్ని రోజుల్లో మెదడు ఈ నిజం గ్రహిస్తుంది, దురద పోతుందని చెప్పి పంపేశాను' మరో సిగరెట్, వెలిగించి దీర్ఘంగా పొగపీల్చి, వదిలి చెప్పటం ఆరంభించాను.

'ఆ యువకుడు రెండ్రోజులకు మళ్ళీ వచ్చాడు. దురద పెరిగిందని, భరించలేకపోతున్నానని ఏడ్చాడు. ఏవేవో పాకుతున్నాయని గోల పెట్టాడు. 'ఇంతకీ తొలగించిన నా చెయ్యి ఎక్కడుంది?' అని అడిగాడు.

తీవ్రవాదుల బాంబుదాడి జరిగిన ప్రదేశానికి దగ్గరలో ఉన్న హాస్పిటల్‌కి ఫోన్ చేశాను. విషయం వివరించాను.

'రోజుకి కొన్ని వందల సంఖ్యలో అంగాలు కోయాల్సి వస్తోంది. సరిగ్గా గుర్తు రావటం లేదు. అయితే, ఇలా కోసిన అంగాలను 'ల్యాబ్'కు పంపుతాం. అక్కడ అడిగి చూడండి' అని 'ల్యాబ్' ఫోను నెంబరిచ్చాడు.

'నేను ల్యాబ్‌కు ఫోను చేశాను' మరో సిగరెట్ వెలిగించాడు లియాన్:

'సాధారణంగా, అంగాలు మరీ దెబ్బతింటే ఇన్సినరేటర్‌లో కాల్చేస్తాం. లేక పోతే పాతి పెట్టేస్తాం. పాథాలజీ ల్యాబ్‌లో వేటినీ ఉంచం. రోజుకు వేల కొద్దీ కాళ్లూ, చేతులూ వస్తుంటాయి' చెప్పాడు 'ల్యాబ్' అధికారి.

'ఇదే విషయం యువకుడికి చెప్పాను. 'నా చెయ్యికి పెద్దగా గాయం కాలేదు, కానీ భుజం నుంచి తీసేశారు.' ఫిర్యాదు చేస్తున్నట్టు అన్నాడు ఆ యువకుడు.

'అతడు చెప్పింది నిజం. ఒకోసారి, కట్టుకట్టి, గాయానికి చికిత్స చేయటం కన్నా చెయ్యి తీసిపారేయటం సులభం. అందుకే అతడి పరిస్థితికి నాకు జాలి కలిగింది. పర్సనల్ ఇంటరెస్ట్ తీసుకున్నాను. అతడిని వెంట తీసుకెళ్ళి రికార్డులు వెతికాను. అతడి చేయిని పాతిపెట్టిన స్థలం కనుక్కున్నాను. అక్కడ తవ్వించాను. బోలెడన్ని, కాళ్ళు చేతులు గుట్టలా పడి ఉన్నాయి. రకరకాల దశల్లో కుళ్లిపోయి ఉన్నాయి. వాటి మధ్య అతని చెయ్యి దొరికింది. పురుగులు సగం చెయ్యిని తినేశాయి. మిగతా సగంపై పురుగులు పాకుతున్నాయి. దాన్ని తీసి కాల్చేశాం. అప్పుడు కానీ అతడి సమస్య తీరలేదు' అన్నాడు లియాన్ సిగరెట్ విసరేస్తూ.

లియన్ చెప్తున్న కథ రసవత్తరమైన ఘట్టంలో ఉండగా 'జీన్ పాజెట్' వచ్చాడు. కథలో మునిగి ఎవరూ అతడి రాకను గమనించలేదు. నేను జీన్‌ని చూశాను. 'డిస్టర్బ్ చెయ్యవద్దు' అన్నట్టు సంజ్ఞ చేశాడు నాకు జీన్. అయితే, ఎందుకో నాకు జీన్ ప్రవర్తన విచిత్రంగా అనిపించింది. కూచున్నాడు కానీ వొంటి పైనుంచి వేటినో విదిలిస్తూనే ఉన్నాడు. అయితే, కథలో మునిగి ఆ విషయం నేను పెద్దగా పట్టించుకోలేదు.

కథ పూర్తి చేసి జీన్ వైపు చూశాడు లియాన్. 'అదిగో నా రిలీవర్ వచ్చేశాడు. సో గుడ్ బైటు ఇరాక్ అన్నాడు'.

అందరం లేచాం. 'జీన్ వచ్చాడంటే మనల్ని తీసుకెళ్లే బండి కూడా వచ్చి ఉంటుంది. కానీ బండి ఆగిన శబ్దం వినిపించలేదు. అంత నిశ్శబ్దంగా ఎలా వచ్చావు జీన్?' అడిగాను లియాన్.

అతడి మాటలు విననట్టే, ఒంటిపైనుంచి దులుపుకోవటంలో మునిగాడు జీన్. అతడి విచిత్రమైన ప్రవర్తనను అందరం విస్తుపోయాం. ఇంతలో బయట పెద్దశబ్దంలో ఏదో వాహనం ఆగింది. దాంతో దృష్టి అటుమళ్లింది.

వెంటనే తుపాకీ కాల్పులు వినిపించాయి.

అందరం బయటకు పరుగెత్తాం.

బయట గ్రీన్‌జోన్ నుంచి బయలుదేరిన వాహనం ఆగింది. 'ఇది ఇప్పుడు వస్తే, జీన్ దీని కన్నా ముందు ఎలా వచ్చాడు?' ప్రశ్న నా మదిలో మెదిలింది. కానీ, హడావిడిగా వాహనంలోంచి దింపుతున్న శవాన్ని నా ఆలోచనలు ఆవిరైపోయాయి.

వాహనంలోంచి సైనికులు దింపుతున్నది జీన్ శవం!

దానిపై ఈగలు ముసురుతున్నాయి.

అంటే, శవంపై వాలిన ఈగలను, జీన్ ఫాంటం దులుపుకుంటోండా! నేను లోపలకు వెళ్లి జీన్‌ని చూడాలనుకున్నాను.

ఇంతలో 'తీవ్రవాదులు దాడి చేస్తున్నారు' అన్నా అరుపు వినిపించింది. క్షణం పరిస్థితి మారిపోయింది.

తుపాకుల మోతతో హోరెత్తిపోయింది.

లోపలకు వెళ్దామని అడుగు వేసిన, నా మెదడు లోంచి, గుండెలోంచి గుళ్లు దూసుకుపోయాయి. నా ఊపిరి ఆగిపోయింది. నేను పడిపోయాను.

***

ఇప్పుడీ కథను నేనెలా చెప్తున్నానన్న సందేహం మీ కొస్తోందా?

'చూసే కన్నూ, రాసే చెయ్యి ఉట్టిగా ఉండవే' అంటారు. రాయటం అలవాటయిన నేను ఎలా ఊరుకోగలను. నా ఫాంటమ్ చెయ్యితో ఈ కథ రాస్తున్నాను.

హ్హ హ్హ హ్హ !!!

*

## 'మాట్రిక్స్'లో ట్రినిటీ, 'ద్రోణ'లో ప్రియాంక!



సూపర్ హీరోల హవా హాలీవుడ్ నుండి బాలీవుడ్‌కీ పాకింది. హృతిక్ రోషన్ 'క్రిష్' గా అలరించాక, ఇప్పుడు అభిషేక్ బచ్చన్ 'ద్రోణ'గా సిద్ధమవుతున్నాడు. కథ ప్రకారం ఇందులో అభిషేక్‌కు కొన్ని అపురూప శక్తులుంటాయి. కానీ అతనికి వాటి గురించి తెలియదు. ఓ మామూలు మనిషిలా బతికేస్తుంటాడు. ప్రియాంకా చోప్రా అతనికి ఆ శక్తుల గురించి తెలియజెప్పే పాత్ర పోషించింది. హాలీవుడ్ క్లాసిక్ 'మాట్రిక్స్'లో కూడా ట్రినిటీ అనే పాత్ర హీరోకి తన శక్తుల గురించి తెలియజెప్పి అతన్ని సూపర్ హీరోగా మారుస్తుంది. ఇప్పుడు ప్రియాంకా పాత్ర ఆ ట్రినిటీ పాత్ర ప్రేరణతోనే మలుస్తున్నారని తెలిసింది. ఇందులో ఆమె ప్రాచీన సిక్కు యుద్ధ విద్య 'ఘట్‌కా' లో నిపుణురాలైన అమ్మాయిగా నటిస్తోంది. చుర కత్తులతో చేసే ఈ యుద్ధ విద్యలో ప్రావీణ్యం సంపాదించడానికి ఆమె శిక్షణ కూడా తీసుకుందట. ఆమెకు సినిమా ఫైటింగులు కొత్త కాదు. ఇది వరకూ షారుక్ ఖాన్ 'డాన్' సినిమాలోనూ చాలా యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొంది.